సాక్షి నిజామాబాద్

సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025



క్రీడల్లో రాణించాలి

ఆర్మూర్‌లో 11వ తెలంగాణ స్టేట్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ ఉమెన్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి.

- 8లో ▸



ఈ-భద్రతతో చోరీలకు చెక్

చోరీలను సాంకేతికతతో నివారించొచ్చని పోలీసులు సూచిస్తున్నారు. దీనిపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.9 /17.2

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న నీటి విడుదల

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఆయకట్టు అవసరాలకోసం మూడో విడుత నీటి విడుదల గతనెల 31న ప్రారంభమైంది. ప్రధాన కాలువకు రోజూ 1,700 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

నేడు జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా రాక

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్ర కారాగారానికి సందర్శన నిమిత్తం జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా ఆదివారం వస్తున్నట్లు జిల్లా జైలర్ ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్‌తో పాటు నిజామాబాద్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధుశర్మ, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు.

తెలంగాణ నెట్‌బాల్ టీం కోచ్‌గా రమేష్



నిజామాబాద్ నాగారం: ఉత్తరాఖండ్‌లో ఈనెల 3 నుంచి 15 వరకు జరిగే 38వ జాతీయ క్రీడలకు తెలంగాణ నెట్‌బాల్ టీం కోచ్‌గా జన్నేపల్లి ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్ ఎంపికయ్యారని నెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. రమేష్‌ను డీఈవో అశోక్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి , జన్నేపల్లి ఇన్‌చార్జి మండల విద్యాధికారి అశోక్ , ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్: సోమవారం నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా పరీక్షలు ఉంటాయి. ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు. 82 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి విడత 34 కేంద్రాల్లో పరీక్ష జరుగనుంది. ఈనెల 22 వరకు పరీక్షలు జరుగుతాయని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు.

మాతృభాషలో వెనుకబాటు!

- ఉన్నత పాఠశాలల్లో పట్టు తప్పిన గుణాత్మక విద్య
- అంక గణితంలో మెరుగుపడిన విద్యార్థుల ప్రమాణాలు
- ఫలితమిచ్చిన తొలిమెట్టు కార్యక్రమాలు
- విద్యావ్యవస్థలో కరోనా సంక్షోభం..
- 1వ తరగతి పుస్తకాన్ని చదువలేక పోయిన ఉన్నత పాఠశాల విద్యార్థులు
- స్వచ్ఛంద సంస్థ ప్రథమ్ వెల్లడించిన అసర్ నివేదిక-2024 వివరాలు

పాఠశాల విద్యలో మాతృ భాషా, గణిత సామర్థ్యాల సాధనలో ఉమ్మడి జిల్లా వెనుకబడింది. మాతృభాషలో 8వ తరగతి పిల్లవాడు 2వ తరగతి వాక్యాలను చదవలేకపోతున్నాడు. మాతృభాషలో ప్రాథమిక స్థాయి విద్యార్థులు కొంత మెరుగుపడినా.. ఉన్నత పాఠశాలల పిల్లలు వెనుకబడ్డారు. గణితంలో కొంత మెరుగుపడిన 8వ తరగతి విద్యార్థులలో 60 శాతం మంది పిల్లలు భాగహారం చేయలేకపోతున్నారు. అరకొర వసతులు, తరగతికి ఒకరు చొప్పున ఉపాధ్యాయుడు లేకున్నా ప్రాథమిక పాఠశాలలు కొంత సత్ఫలితాలు సాధించగా, ఉన్నత పాఠశాలలు గుణాత్మక విద్యాలో వెనుకబడ్డాయి. ఇటీవల స్వచ్ఛంద సంస్థ ప్రథమ్ వెల్లడించిన అసర్ నివేదిక-2024లో విద్యార్థుల చదువులు నివ్వెరపరిచాయి.



నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో 2,175 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, విద్యార్థులు లక్ష 68 వేల మంది ఉన్నారు. వీరికి సంబంధించిన విద్యాబోధన అంశాలను స్వచ్ఛంద సంస్థ ప్రథమ్ 'అసర్ నివేదిక-2024'లో వెల్లడించింది. 2020లో కరోనా మహమ్మారి పాఠశాల విద్యా వ్యవస్థలో అభ్యాసన సంక్షోభాన్ని సృష్టించింది. రెండు విద్యాసంవత్సరాలను విద్యార్థులు కోల్పోవడంతో మాతృభాషలో సరిగా చదవలేకపోతున్నారు. ప్రాథమిక విద్యా వ్యవస్థలో తొలిమెట్టు కార్యక్రమం వలన కొంత ఫలితాలు మెరుగు పడినా ఆశించిన కనీసం అభ్యాసన సామర్థ్యాలను సాధించలేకపోయారు. తరగతికి ఒక ఉపాధ్యాయుడు గల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు మాతృభాషలో 1వ తరగతి పుస్తకాన్ని 77 శాతం మంది చదువులేకపోయారు. అదే ప్రాథమిక స్థాయిలో అక్షరాలను 42 శాతం మంది 1వ తరగతి విద్యార్థులు చదువుతున్నారు. కానీ 5,8 తరగతుల విద్యార్థులు పదాలను, వాక్యాలను చదువలేకపోతున్నారు. ఉన్నత పాఠశాలల్లో తరగతికి ఒకరు చొప్పున ఉపాధ్యాయుడు, పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడు ఉన్నా సరైన పర్యవేక్షణ లేక గుణాత్మక విద్య పట్టుతప్పింది.

అంక గణితంలో..


మాతృభాషలో వెనుకబడిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు అంక గణితంలో గుణాత్మక ఫలితాలు సాధించారు. 3-5 తరగతులకు చెందిన విద్యార్థులు 57.7 శాతం మంది చిన్న తీసివేతలు చేయగలిగారు. భాగహారాలను 6-8 తరగతి విద్యార్థులు 36.2 శాతం మంది చేశారు.

తొలిమెట్టు విద్యా కార్యక్రమాలు గత విద్యా సంవత్సరంలో సక్రమంగా అమలు కావడం వల్ల పాఠశాల స్థాయి విద్యార్థులు కనీస అభ్యసన సామర్థ్యాలను సాధించగలిగారు.

2022 అసర్ నివేదిక ఫలితాల కన్నా 2024 అసర్ నివేదిక ఫలితాలు గణితంలో మెరుగయ్యాయి. అలాగే రాష్ట్ర సగటు కంటే మన ఉమ్మడి జిల్లా సగటు ఎక్కువగా ఉంది.

■ కరోనా సమయంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు ప్రవేశాలు పెరిగినా.. అనంతరం భారీగా తగ్గాయి. కాగా ఇటీవల ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వడం, నూతన ఉపాధ్యాయుల నియామకం, పర్యవేక్షణకు ఎంఈవోలను నియమించడం వలన వచ్చే నూతన విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతాయని విద్యావేత్తలు, ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన ప్రవేశాలు



2014-15 విద్యాసంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 2.10 లక్షల మంది విద్యార్థులతో ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడేవి. దాదాపుగా 60 శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారు. వసతుల లేమి, ఉపాధ్యాయుల కొరత, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల గత దశాబ్ద కాలంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గాయి. 2024 అసర్ నివేదిక ప్రకారం ఉమ్మడి జిల్లాలో 47.9 శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు.

అసర్ నివేదికలో విద్యార్థుల సామర్థ్యం (శాతంలో)

తరగతి	అక్షరాలను గుర్తించక పోవడం	అక్షరాలు చదవడం	పదాలు చదవడం	1వ తరగతి పాఠం చదవడం	2వ తరగతి పాఠం చదవడం
1	30.8	42.2	21.9	4.2	0.9
2	13.2	37.9	36.0	10.4	2.5
3	7.8	26.5	41.3	18.3	6.2
4	4.0	16.6	34.0	28.8	16.2
5	2.6	11.6	26.9	27.4	31.6
6	3.8	9.6	18.3	27.7	40.6
7	2.3	10.5	15.7	27.4	44.1
8	1.6	7.7	11.7	22.7	56.4



ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

పర్యవేక్షణ పెరగాలి



ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ పెరగాలి. దీంతో పాఠశాల విద్యాబోధన సక్రమంగా కొనసాగుతుంది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి టీచర్ల కొరత తీర్చాలి. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుబాటులోకి వస్తుంది. వీటితో పాటు పర్యవేక్షణ ముఖ్యం. – సత్యానంద్, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

సరైన ప్రణాళికను రూపొందించాలి



ప్రాథమిక విద్యావ్యవస్థలో విద్యార్థులకు అందిస్తున్న బోధన సక్రమంగా ఉంది. అయితే దీనిని ఒక ప్రణాళిక ప్రకారం కొనసాగించాలి. విద్యాబోధన విద్యార్థులకు ఏమేరకు ఉపయోగపడుతుందో తెలుసుకొని మార్పులు, చేర్పులతో బోధన చేపట్టాలి. దీంతో ప్రతి విద్యార్థి మెరుగైన విద్యను అందుకుంటాడు. ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపడతాయి.

– భూమయ్య, పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు, నవీపేట



ముస్తాబైన నీలకంఠేశ్వరాలయం

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ నగరంలోని నీలకంఠేశ్వరాలయాన్ని ఈనెల 4న జరుగనున్న రథసప్తమి సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. మాఘశుద్ధ సప్తమి రోజున రథయాత్ర నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. రథం ఊరేగింపు సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయ కార్య నిర్వాహక అధికారి శ్రీరామ్ రవీందర్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

కొత్త ఉద్యోగుల్లో అయోమయం

- బల్దియాలో చేరిన 33 మంది..
- 40 రోజులు దాటినా నో ట్రైనింగ్
- పనులపై కనీస అవగాహన కరువు
- దృష్టిసారించని అధికారులు



నిజామాబాద్ సిటీ: సర్కారు కొలువు దొరకగానే వారిలో గంపెడాశలు చిగురించాయి. గ్రూప్-4 పరీక్ష పాసయ్యారు. ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఎవరికి ఎక్కడ పనిచేయాలో సూచించారు. అందులో భాగంగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 44 మంది ఉద్యోగులను కేటాయించారు. వారిలో 33 మంది బల్దియా కార్యాలయంలో రిపోర్టు చేశారు. మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌ను కలిసి విధుల్లో చేరారు. తర్వాత మొదలైంది అసలైన సమస్య. తామేం చేయాలో వారికి తెలియడం లేదు. విధుల్లోకి తీసుకున్నారు తప్ప విధి విధానాలు వివరించలేదు.

నెలరోజులైనా..

మున్సిపల్ కార్పొరేషన్‌లో జాయిన్ అయిన 33 మందిలో నలుగురిని వార్డు ఆఫీసర్లుగా తీసుకున్నారు. మిగితా వారిని జూనియర్ అసిస్టెంట్ హోదాలో తీసుకున్నారు. వార్డు ఆఫీసర్‌లకు ప్రత్యేకమైన విధి విధానాలు, నియమ నిబంధనలున్నాయి. వీటిని ఉద్యోగులకు వివరించాల్సిన బాధ్యత అధికారులదే. కానీ బల్దియా అధికారులు కొత్త ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించలేదు. శిక్షణ కూడా ఇవ్వలేదు.

అన్ని సెక్షన్‌లపై..

బల్దియాలో పనిచేసే ఉద్యోగులకు అన్ని సెక్షన్‌లపై అవగాహన అవసరం. కొత్తగా విధుల్లో చేరినవారు వార్డు ఆఫీసర్లుగా, జూనియర్ అసిస్టెంట్లుగా నియామకమయ్యారు. వీరికి రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్, ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ వంటి పలు విభాగాల పనితీరు, పనులు జరిగే విధానం తెలుసుకోవాల్సి ఉంటుంది. అవసరమైతే ఏ విభాగంలోనైనా విధులు నిర్వహించాల్సి రావొచ్చు. వీరిలో చాలా మంది బీటెక్ చదివిన వారే ఎక్కువగా ఉన్నారు. దీంతో వీరిలో చాలా మందికి సాధారణ పాలన పట్ల కనీస అవగాహన ఉండదు. కాగా కార్పొరేషన్‌లో కొత్తగా నియామకమైన ఉద్యోగులకు కనీస అవగాహన కార్యక్రమం, శిక్షణ ఇవ్వలేదు. వీరు విధుల్లో చేరి 40 రోజులు దాటుతోంది. వీరిలో కొందరిని పారిశుధ్య విభాగంలో నియమించారు. మరికొందరిని పన్నుల వసూళ్లలో వేశారు. అయితే వీరు చేయాల్సిన విధులేంటో మాత్రం వీరికి తెలియడం లేదు. శిక్షణ ఇవ్వకుండా క్షేత్రస్థాయికి పంపడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. కచ్చితంగా డ్యూటీలు చేయలేకపోతున్నారు.

అయితే కొత్తగా వచ్చిన ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడంలో ఉన్నతాధికారులు దృష్టిసారించలేక పోతున్నారు. ప్రభుత్వం ఆదేశించిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే, వార్డుసభలు అంటూ సర్వేలు చేయడంతో అధికారులకు సమయం గడిచిపోయింది. ప్రస్తుతం పన్నుల వసూళ్లలో బిజీగా అయ్యారు.

అందువల్ల కొత్త ఉద్యోగులకు కచ్చితమైన డ్యూటీలు వేయడం, వారికి నిబంధనల ప్రకారం చేయాల్సిన పనులు పురమాయించడం ఎప్పుడోనని పలువురు అంటున్నారు.

జయహో భారత్

నిజామాబాద్ నాగారాం: భారత అమ్మాయిల జట్టు చరిత్ర సృష్టించింది. మహిళల అండర్-19 టీ-20 ప్రపంచకప్ 2025 టైటిల్ సాధించింది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగి ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోకుండా టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను 9 వికెట్ల తేడాతో ఓడించింది. కౌలాలంపూర్ వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 82 పరుగులకే ఆలౌట్ అయింది. దేశప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలువురు క్రీడాకారిణులు తమ సంతోషాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

మాకు స్ఫూర్తిగా నిలిచారు



ప్రపంచ విజేతగా నిలిచిన భారత మహిళా జట్టుకు ప్రత్యేక ధన్యవాదాలు. మాలాంటి క్రీడాకారులకు ఇలాంటి చాంపియన్ ట్రోఫీలు టీవీల్లో, పేపర్లో చూస్తున్నప్పుడు మాలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఎంతగానో దోహద పడుతుంది. – అరేబి రహమత్, రాష్ట్రస్థాయి క్రీడాకారిణి(అండర్-14)

త్రిష ఆటతీరు బాగుంది



కౌలాలంపూర్ వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గొంగడి త్రిష ఆటతీరు బాగుంది. నేను సైతం భారత జట్టుకు ఆడేందుకు శ్రమిస్తున్నాను. ఈ జట్టు విజయం నాలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఉత్సాహం కలిగిస్తుంది. మాలాంటి క్రీడాకారులకు ఇది స్ఫూర్తిదాయకం.

– వర్ష, రాష్ట్రస్థాయి క్రీడాకారిణి(అండర్-16)

పండుగలా ఉంది



ప్రపంచకప్ చాంపియన్‌షిప్లో భారత జట్టు విశ్వ విజేతగా అవతరించిన వేళ దేశంలోని క్రీడాకారులకు, అభిమానులకు పండుగలా ఉంది. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తే అన్ని క్రీడల్లోనూ చాంపియన్గా నిలుస్తారు. భారత జట్టుకు అభినందనలు.
– శ్రీజ, రాష్ట్రస్థాయి క్రీడాకారిణి(అండర్-19)

రైతు భరోసా ఆలస్యమేనా...?

- ఎంపిక చేసిన మండలానికి ఒక గ్రామంలోని రైతులకు జమైన సొమ్ము
- మిగిలిన గ్రామాల్లోని రైతుల ఎదురు చూపులు
- ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరుతున్న లబ్ధిదారులు

మోర్తాడ్(బాల్కొండ): యాసంగి సీజన్ పెట్టుబడి సాయం సొమ్ము జమ చేయడంలో ఇంకా కొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 26 నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా సొమ్ము జమ కావాల్సి ఉంది. గణతంత్ర దినోత్సవం రోజున లాంఛనంగా కార్యక్రమం ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన 31 గ్రామాలలోని రైతులకే వంద శాతం రైతు భరోసా సొమ్మును జమ చేశారు. మిగిలిన గ్రామాల్లోని రైతులకు మాత్రం ఇంకా సొమ్ము జమ కాలేదు.

గతంలో తొలి విడతలో ఒక ఎకరం విస్తీర్ణం లోపు భూమి ఉన్న రైతులకు పెట్టుబడి సాయం జమ చేసేవారు. ఇలా విడతల వారీగా వారం నుంచి పదిహేను రోజుల పాటు రైతుల ఖాతాల్లో వారికి ఉన్న భూమి విస్తీర్ణం లెక్క ప్రకారం సొమ్ము జమ అయ్యేది. ఈసారి అలాకాకుండా తొలి విడతలో ఎంపిక చేసిన గ్రామాల్లోని మొత్తం మంది రైతులకు రైతు భరోసా సొమ్మును జమ చేశారు. రైతులకు ఉన్న భూముల విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఎంత ఉన్నా సాగుకు యోగ్యమైన భూమి ఉంటే చాలు పెట్టుబడి సొమ్మును జమ చేశారు. అలా 31 గ్రామాలలోని 15,937 మంది రైతులకు రూ.18 కోట్ల, 52 లక్షల, 43 వేల, 385 విడుదలైంది.

సాగుకు యోగ్యం కాని భూముల తొలగింపు...

గత ప్రభుత్వం గుట్టలు, రియల్ ఏస్టేట్ వెంచర్లు, పరిశ్రమలు ఇలా ఎన్నో రకాల సాగుకు యోగ్యం కాని భూములకు పెట్టుబడి సాయం అందించి రూ.కోట్లాది సొమ్మును పక్కదారి పట్టించిందని కాంగ్రెస్ ప్రభుత్వం వెల్లడించింది. రైతు భరోసా కింద గతంలో కంటే ఒక్కో ఎకరానికి రూ.వెయ్యి పెంచి సాగుకు యోగ్యమైన భూములకే పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించింది. సాగుకు యోగ్యం కాని భూముల వివరాలను నమోదు చేయగా 10 వేల ఎకరాలకు పైగా భూమిని గుర్తించారు. ఈ భూమిని మినహాయించి మిగిలిన మొత్తం భూమికి రైతు భరోసా మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సుమారు 2.90 లక్షల మంది రైతులకు వారి వద్ద ఉన్న సాగుకు యోగ్యమైన భూమికి పెట్టుబడి సాయం అందించనున్నారు. గతంలో కంటే కొంత భూమి విస్తీర్ణం తగ్గినా సాయం సొమ్ము పెరగడంతో ఇంకా ఎక్కువ నిధులే జిల్లాకు విడుదల అయ్యే అవకాశం ఉంది. వ్యవసాయ, రెవెన్యూ శాఖలు ఎంత విస్తీర్ణం భూమికి, ఎంత మంది లబ్ధిదారులు అనే లెక్కలు తీస్తున్నారు. ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేయడం వల్ల లబ్ధిదారుల ఖాతాల్లో పెట్టుబడి సాయం సొమ్ము జమ కావడంలో కొంత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తుంది.



వ్యవసాయ శాఖకు సమాచారం కరువు..

రైతు భరోసా నిధుల విడుదల విషయంలో ప్రభుత్వం నుంచి వ్యవసాయ శాఖకు స్పష్టత లేకపోవడం గమనార్హం. కేవలం లాంఛనంగా కార్యక్రమం ప్రారంభించిన గ్రామాలు, అక్కడి రైతుల సంఖ్య, వారికి విడుదలైన మొత్తం సొమ్ము వివరాలే వ్యవసాయ శాఖ వద్ద ఉన్నాయి. మిగిలిన గ్రామాలలోని రైతులకు రైతు భరోసా సొమ్ము విడుదలకు సంబంధించి ఎలాంటి సమాచారం లేదు. ప్రభుత్వం రంగారెడ్డి ట్రెజరీ ద్వారానే రైతు భరోసా సొమ్మును విడుదల చేయనుండటంతోనే సమాచార లోపం ఏర్పడినట్లు తెలుస్తోంది.

ఎన్నికల కోడ్ బ్రేక్ వేయకపోయినా...

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలుతో రైతు భరోసాకు బ్రేక్ పడుతుందని ఊహాగాలు వినిపించాయి. రైతు భరోసా పథకం కోడ్ కూయక ముందే అమలు చేయడం, ఈ పథకం పాతదే కావడంతో కోడ్ ఎలాంటి అడ్డంకు సృష్టించదని అధికార యంత్రాంగం వెల్లడిస్తోంది. కోడ్ వర్తించకపోవడంతో రైతులకు ఊరట కలిగిస్తున్నా నిధుల విడుదల విషయంలో మాత్రం జాప్యం తీవ్ర నిరాశను మిగులుస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఇప్పటికే ఆలస్యమైంది



రైతు భరోసా సొమ్ము విడుదల చేసే విషయంలో ఇప్పటికే ఆలస్యమైంది. యాసంగి పంటల సాగు ఎప్పుడో మొదలైంది. ప్రభుత్వం పెట్టుబడి సాయం తొందరగా రైతులకు విడుదల చేయాలి. పెట్టుబడుల కోసం రైతులు అప్పులు చేయాల్సి వస్తోంది. జాప్యం చేయకుండా నిధులు కేటాయించాలి. – మాదాం చిన్న నర్సయ్య, రైతు, తొర్తి

అర్హులైన అందరికీ సొమ్ము జమ

అర్హులైన రైతులందరికీ రైతు భరోసా సొమ్ము జమ అవుతుంది. తొలి విడతలో ఎంపిక చేసిన గ్రామాల్లోని అందరు రైతులకు సొమ్ము జమ చేశారు. కొన్ని రోజుల్లోనే జిల్లాలోని అన్ని గ్రామాల రైతులకు పెట్టుబడి సాయం విడుదల చేస్తారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ అవుతుంది.

– వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

క్రీడల్లో రాణించాలి



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడమైదానంలో 11వ తెలంగాణ స్టేట్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ ఉమెన్ చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ హాజరై క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. వివిధ జిల్లాల నుంచి మొత్తం 20 జట్లు పాల్గొంటుండగా, రెండు రోజులపాటు పోటీలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారాం, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి గంగామోహన్, బేస్ బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపంథా నాయకుడు యాదగిరి మృతి



నిజామాబాద్ సిటీ: నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పనిచేసిన సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా నాయకుడు యాదగిరి జీవితం కమ్యూనిస్టులకు ఆదర్శమని నాయకులు అన్నారు. యాదగిరి అనారోగ్యంతో మృతి చెందగా, పార్థివదేహాన్ని ఆదివారం నగరంలోని ఎన్ఆర్ భవన్‌లోని పార్టీ కార్యాలయంలో ఉంచి నివాళులు అర్పించారు. యాదగిరి కళ్లను ఐ బ్యాంక్‌కు దా నం చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అప్పగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. యాదగిరి సుదీర్ఘకాలం పార్టీకోసం పనిచేశారని కొనియాడారు. తన మరణం తరువాత శరీరం సమాజానికి ఉపయోగపడాలనే ఆకాంక్షతో కళ్లు, శరీరాన్ని దానంచేసి చరిత్రలో చిలిచిపోయారన్నారు. యాదగిరి మిత్రులు, సహచరులు, పార్టీ నాయకులు వనమాల కృష్ణ, కే సూర్యం, వీ ప్రభాకర్, వేములపల్లి వెంకట్రామయ్య, ఆకుల పాపయ్య, రమేశ్‌బాబు, కంజర భూమయ్య, మండవ వెంకటేశ్వరరావు, డాక్టర్ లక్ష్మారెడ్డి, డాక్టర్ సూరి, రజనీకాంత్, నర్రా రామారావు, సాంబయ్య, నరేందర్, రామకృష్ణ, వెంకన్న, దేవారాం, రాజేశ్వర్, ముష్క సుధాకర్, సంధ్యా రాణి, సుధారాణి, భాస్కరస్వామి, శివరాజు, రవీందర్, రాధా పాల్గొన్నారు.

ఈ - భద్రతతో చోరీలకు చెక్

- అందుబాటులో అధునాతన పరికరాలు
- ఎక్కడ ఉన్నా అప్రమత్తం చేసే ఎలక్ట్రానిక్ పరికరాలు..

ఖలీల్‌వాడి: జిల్లాలో ఎక్కడో ఓ చోట చోరీ జరిగిందని రోజూ వినబడుతూనే ఉంటుంది. లక్షల నుంచి కోట్లాది రూపాయలు వెచ్చించి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారు ఇంటి భద్రతపై మాత్రం రూ.100 నుంచి రూ.500 తాళాలపై ఆధారపడుతున్నాం. దీంతో దుండగులకు చోరీలు చేయడం ఈజీ అవుతోందని, చోరీలను సాంకేతికతతో నివారించొచ్చని పోలీసులు సూచిస్తున్నారు. దీనిపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు సైతం ఇంటికి సాంకేతికంగా భద్రత కల్పించే వస్తువుల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్, మార్కెట్‌లో ఇంటికి భద్రతకు సంబంధించిన వస్తువులు అందుబాటులో ఉన్నాయి. సీసీ కెమెరాలు, అప్రమత్తం చేసే అలారాలు, వైర్లను కత్తిరిస్తే తెలిపే ట్యాంపర్ ప్రూఫ్, వీడియోడోర్ ఫోన్, అలారం లాక్ డిటెక్టర్.. ఇలా ఎన్నో ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలపై అవగాహన కల్పిస్తున్నామని అలాగే కళాబృందాలు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తామని నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు.



వీడియో డోర్ ఫోన్

మన ఇంటికి వచ్చి డోర్ ముందు ఉన్న వారిని లోపలి నుంచే గుర్తించేందుకు ఉపయోగపడుతుంది. ఇది కాలింగ్ బెల్ లాగా పని చేస్తుంది. వైర్స్, బ్యాటరీతో పనిచేసే ఈ పద్ధతికి రెండు పరికరాలు ఉంటాయి. కాలింగ్ బెల్ బటన్, స్పీకర్ ఉన్న యూనిట్‌ను ఇంటి బయట బిగిస్తారు. స్క్రీన్‌తో కూడిన పరికరాన్ని ఇంటి లోపల పెడతారు. ఇంటికి వచ్చింది అపరిచిత వ్యక్తులా లేక తెలిసిన వారా? అని గుర్తించిన తర్వాత తలుపులు తీసేందుకు ఈ పరికరం ఎంతో తోడ్పుతుంది. దీని ధర రూ.5వేల నుంచి మొదలవుతుంది.

సీసీ కెమెరాలు, గుర్ఖాలు, సెక్యూరిటీ గార్డులు



పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కాలనీల వాసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకువాలి. దీంతో కాలనీలోకి కొత్తవారు వస్తే వారిని గుర్తించే అవకాశం ఉంటుంది. అపరిచిత వ్యక్తులు కనబడితే కాలనీవాసులు వివరాలను సేకరించాలి. దీంతో పాటు రాత్రి వేళల్లో గుర్ఖాలను, షాపుల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవడంతో దొంగతనాలు నివారించే అవకాశం ఉంటుంది.

ఇంటి సెంట్రల్ లాక్ సిస్టం

ఇంటి తలుపులకు సెంట్రల్ లాక్ సిస్టంను ఏర్పాటు చేసుకోవాలి. ఈ లాక్ డోర్‌లోపల అమర్చి కనబడకుండా ఉంటుంది. దీనిపై నుంచి గొళ్లెంను ఏర్పాటు చేసుకుని తాళం వేసుకుంటారు. తాళం పగలగొట్టిన సెంట్రల్ లాక్‌సిస్టం ద్వారా డోర్ తెర్చుకోలేదు. దీంతో దుండగులు తాళాలు పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించి దొంగతనం చేసే వీలుండదు.




2024లో జిల్లాలో 33 దోపిడీలు జరగగా 21 కేసుల్లో నిందితులను గుర్తించారు. 12 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. రాత్రి వేళల్లో 350 చోరీలు జరిగాయి. 65 కేసులను పోలీసులు ఛేదించగా, 285 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పగటి వేళలో 38 చోరీలు జరగగా, 11 కేసుల్లో నిందితులను పట్టుకున్నారు. 27 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 2023తో పోలిస్తే 2024లో 7శాతం చోరీలు పెరిగాయి.

అప్రమత్తం చేసే అలారం



పండగలు, సెలవుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో డోర్‌కు తాళం వేసి వెళ్తుంటాం. ఈ సమయంలో దొంగలు చోరీ చేసేందుకు ప్రయత్నిస్తే పెద్ద శబ్దంతో ఇంటి యజమానితోపాటు పోలీసులకు సమాచారం వెళ్తుంది. ఇంటికి కంట్రోల్ ప్యానల్ పరికరాన్ని ఏర్పాటు చేసి, దీనికి అనుసంధానంగా తలుపులు, కిటికీలకు సెన్సార్లను ఏర్పాటు చేస్తారు. ఇంటికి తాళం వేసి వెళ్లాక ఎవరైనా తలుపులు, కిటికీలను విరగొట్టి ఇంటిలోకి ప్రవేశించడానికి ప్రయత్నం చేస్తే పెద్ద శబ్దాలు రావడంతోపాటు ఇంటి యజమాని ఫోన్‌కు, పోలీసులకు సమాచారం వెళ్లే విధంగా సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేశారు, కమ్యూనికేటర్ పరికరంతోనే ఇదంతా జరుగుతుంది. వీటి ధర రూ.1500 నుంచి రూ.10వేల వరకు ఉంది.

వాహనాల కోసం జీపీఎస్



వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేస్తే వాహనం చోరీకి గురైనసమయంలో ఎటువైపు వెళ్లిందో ఇందులో స్పష్టంగా కనబడుతుంది. దీంతో వాహనాన్ని పోలీసుల సహాయంతో తిరిగి పొందే అవకాశం ఉంటుంది. జీపీఎస్ నెట్‌వర్క్ మీద ఆధారపడి ఉంటుంది. ట్రాకింగ్ కిట్‌ను కమ్యూనికేటర్ పరికరంతో వాహనానికి ఏర్పాటు చేస్తారు. ఇది బయట కనిపించకుండా ఇంజిన్ దగ్గర దీనిని బిగిస్తారు. ఈ జీపీఎస్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేసి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను వాహనాదారుడి ఫోన్‌కు అనుసంధానం చేస్తారు. ఇంటర్‌నెట్ సహాయంతో వాహనం ఏ ప్రాంతంలో ఉన్నది, ఎక్కడికి వెళ్తోంది? ఎంత స్పీడ్‌లో వెళ్తోంది? ఆనేది ఫోన్‌లో లేదా కంప్యూటర్‌లో చూసే అవకాశం ఉంటుంది.

మానవతాసదన్ పిల్లలకు హెచ్‌వీపీ వ్యాక్సిన్



వ్యాక్సిన్ తీసుకున్న పిల్లలతో ఇన్నర్ వీల్ లేడీస్ క్లబ్ ప్రతినిధులు, డాక్టర్ బండారు ఉష

డిచ్‌పల్లి: ఇన్నర్‌వీల్ లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బృందావన్ ఆస్పత్రి వైద్యురాలు ఉష పర్యవేక్షణలో మండల కేంద్రంలోని మానవతాసదన్ పిల్లలకు ఆదివారం హెచ్‌వీపీ వ్యాక్సిన్ వేశారు. సదన్‌లో 9 నుంచి 17 సంవత్సరాల వయస్సున్న 53 మంది పిల్లలకు వ్యాక్సిన్ ఇచ్చారు. వ్యాక్సిన్ వేయడం వల్ల పిల్లలను క్యాన్సర్, టీబీ, హార్ట్‌ఎటాక్ వంటి వాటి నుంచి కాపాడగలుగుతామని డాక్టర్ ఉష తెలిపారు. సదన్ పిల్లలకు వ్యాక్సిన్ వేయడానికి అవకాశం ఇచ్చిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, డీఈవో అశోక్‌కు డాక్టర్ ఉష కృతజ్ఞతలు తెలిపారు. మానవతా సదన్ పిల్లల ఆరోగ్యం కోసం హెచ్‌వీపీ వ్యాక్సిన్ అందజేసిన ఇన్నర్ వీల్ లేడీస్ క్లబ్ ప్రతినిధులతోపాటు డాక్టర్ ఉషకు సదన్ కేర్‌టేకర్ అందె రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బృందావన్ ఆస్పత్రి సిబ్బంది సందీప్, ప్రియాంక, సౌమ్య, పూజ, చంద్రశేఖర్, సతీశ్, సదన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



నర్సాపూర్‌కు బయల్దేరిన వలంటీర్లు

తెయూ(డిచ్‌పల్లి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్‌లో ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు జరిగే జాతీయ సమైక్యత శిబిరానికి తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆదివారం తరలివెళ్లినట్లు వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కే రవీందర్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కంటింజెంట్ అధికారిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల భీమ్‌గల్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి సుదర్శన్ వ్యవహరిస్తారన్నారు.

శిబిరానికి వలంటీర్లు ఎం శ్రీకాంత్, బి రాము (తెయూ), సీహెచ్ గంగాప్రసాద్ (జీడీసీ, భీమ్‌గల్), పి.సంగీత (గిరి రాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల), బి మానస (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ, కామా రెడ్డి), కే నిర్మల (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ, నిజామాబాద్) ఎంపికైనట్లు కో ఆర్డినేటర్ తెలిపారు. శిబిరంలో కల్చరల్, లిటరరీ అంశాలపై పోటీలు, జాతీయ సమగ్రతపై అవగాహన కార్యక్రమాలు, వికసిత్ భారత్, మై భారత్, యోగా, సామాజిక కార్యక్రమాలు, డ్రగ్స్, మత్తుపదార్థాలను నిరోధించడం, అభివృద్ధి పథంలో విద్యార్థులు అనే అంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారని వివరించారు. జాతీయ సమైక్యత శిబిరానికి వెళ్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లను తెయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988 -89 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం నందిపేట పద్మశాలి కళ్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి స్మృతులను నెమరువేసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు అబ్దుల్ నబీ, రామ్మూర్తి, జనార్దన్, లక్ష్మీకాంతాచారి, పీఈటీ నరసింహారెడ్డి, శంకర్, సాయన్న, రామానుజను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

● క్రమ శిక్షణ, స్ఫూర్తి ఇదేనా..?



క్రమశిక్షణ అలవడడంతోపాటు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎన్‌సీసీలో చేరిన విద్యార్థినులు రోడ్డు భద్రత నిబంధనలను గాలికి వదిలేశారు. నగరంలోని గంగాస్థాన్ నుంచి కంఠేశ్వర్ వైపునకు ఆదివారం ఇలా ఆటోలో పరిమితికి మించి ప్రయాణించారు.

– నిజామాబాద్ అర్బన్

క్రైం కార్నర్

మహిళ మృతదేహం లభ్యం



మాక్లూర్: భర్తతో గొడవపడి ఆవేశంలో ఇంటి నుంచి బయటికి వెళ్లిన భార్య చెరువులో శవమై తేలింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన దండ్ల వెంకట్ కొద్ది రోజుల క్రితం తన భార్యతో గొడవపడి పిల్లలతోపాటు ఆమెను పుట్టింటికి పంపించాడు. పది రోజుల క్రితం బోదాసు లలిత(40) అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు అప్పటికే ఎనిమిదేళ్ల కూతురు ఉంది. అయితే వెంకట్ రెండో పెళ్లి చేసుకున్న విషయం తెలిసి మొదటి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో శనివారం రాత్రి వెంకట్, లలిత గొడవపడ్డారు. లలిత క్షణికావేశంలో సమీపంలో ఉన్న చెరువు వద్దకు వెళ్లి అందులో దూకింది. రాత్రి వేళ వెతకడం సాధ్యం కాక పోవడంతో పోలీసులు వెనుదిరిగారు. ఆదివారం ఉదయం చెరువులో లలిత మృతదేహం తేలడంతో పోలీసులు బయటికి తీయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెర్కిట్‌లో గడ్డివాము దగ్ధం



ఆర్మూర్‌టౌన్: పట్టణ పరిధిలోని పెర్కిట్‌లో ఆదివారం ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైంది. స్థానికులు సమాచారం మేరకు ఘటనాస్థలానికి ఫైరింజన్ చేరుకుంది. ఫైర్ సిబ్బందిని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.25వేల నష్టం వాటిల్లిందని బాధితుడు రంజిత్ తెలిపారు.

మహిళ అదృశ్యం



రామారెడ్డి: మండలంలోని ఉప్పల్‌వాయికి చెందిన మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చాకలి శ్యామల(41) అనే మహిళకు మతిస్థిమితం లేదు. 40 రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఆమె కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో శ్యామల భర్త స్వామి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలయంలో చోరీ

నవీపేట : మండలంలోని బినోల గ్రామ శివారులో ఉన్న మహాలక్ష్మి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. గ్రామానికి చెందిన కన్నం మహేందర్ మరో వ్యక్తితో కలిసి తాళాలు పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించి హుండీలోని నగదును ఎత్తుకెళ్లారన్నారు. గ్రామానికి చెందిన అయిటి దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్ఆర్‌లో ఉన్నత విద్యావకాశాలు



వరదారెడ్డిని సన్మానిస్తున్న విద్యా సంస్థల సిబ్బంది

నిజామాబాద్ అర్బన్: ఎస్ఆర్ యూనివర్సిటీ ద్వారా ఇంటర్మీడియెట్ తర్వాత ఎన్నో ఉన్నత విద్యావకాశాలు ఉన్నాయని, వాటిని జిల్లాకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఆర్ యూనివర్సిటీ ఛాన్సలర్, ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఏ వరదారెడ్డి అన్నారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు ఎస్ఆర్ యూనివర్సిటీ ద్వారా అందిస్తున్న కోర్సులు, సౌకర్యాలు, ఉన్నత విద్య అవకాశాలను వివరించారు. ఎన్ఐఆర్ఎఫ్ గుర్తింపు కలిగి జాతీయ స్థాయిలో 98వ ర్యాంకు ఉన్న తెలంగాణలోనే ఏకైక యూనివర్సిటీ ఎస్ఆర్ అని తెలిపారు. ఎస్ఆర్ యూనివర్సిటీలో బీటెక్ కోర్సులతోపాటు బీఎస్సీ అగ్రికల్చర్, బిజినెస్ స్కూల్, మేజర్ డిగ్రీ, మైనర్ డిగ్రీలు ఒకేసారి పొందే అవకాశం ఉందన్నారు. ఇంటర్నేషనల్ ఇంజినీరింగ్ ప్రోగ్రాంలో భాగంగా మూడు సంవత్సరాలు ఇక్కడ, రెండు సంవత్సరాలు అమెరికాలో, రెండు సంవత్సరాలు ఇక్కడ, రెండు సంవత్సరాలు ఆస్ట్రేలియాలో ఇంజినీరింగ్ పూర్తి చేసే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు స్టార్టప్ కంపెనీలను స్థాపించేందుకు యూనివర్సిటీనే పెట్టుబడి పెడుతుందన్నారు. అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఈ అవకాశాన్ని నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ అనిత, అడ్మిషన్ డైరెక్టర్ శేష గిరిరావు, సీనియర్ డైరెక్టర్ రామ్ దేశ్‌ముఖ్ తమ సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో నిజామాబాద్ డీజీఎం గోవర్ధన్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్, విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

వరద కాలువ ద్వారా నీటి విడుదల నిలిపివేత

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు ఆదివారం నిలిపివేశారు. ప్రాజెక్ట్ నుంచి వారబందీ ప్రకారం కాకతీయ కాలువ జోన్–2 ఆయకట్టుకు 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ నీటి వృథా ఎక్కువగా ఉండడంతో 3 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేపట్టారు. కాకతీయ కాలువ ద్వారా 4,500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 250, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 210, గుత్ప ఎత్తిపోతల ద్వారా 270, సరస్వతి కాలువ ద్వారా 700, ముంపు గ్రామాల ఎత్తిపోతల ద్వారా 312 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా ఆవిరి రూపంలో 349 క్యూసెక్కుల నీరు పోతోంది. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1080.90(47.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ఘటనాస్థలంలో నాగరాజు మృతదేహం

ఇందల్వాయి: మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకున్న ప్రమాదంలో బత్తుల నాగరాజు(32) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. నాగరాజు నిజామాబాద్ వైపు నుంచి కామారెడ్డి వైపు వెళ్తుండగా సర్వీస్ రోడ్డు వద్ద పెట్టిన మట్టి బ్యాగులను బైక్ ఢీకొని కింద పడిపోయాడు. అదే సమయంలో దూసుకొచ్చిన కంటైనర్ ఢీకొట్టడంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మెదక్ జిల్లాకు చెందిన వ్యక్తి అని తెలిసింది. సమాచారం అందుకున్న ఎస్సై మనోజ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండున్నర కిలోల గంజాయి పట్టివేత



వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్ రెడ్డి

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వెల్మల్ చౌరస్తాలో పోలీసులు ఆదివారం ఉదయం రెండున్నర కిలోల గంజాయిని పట్టుకున్నారు. నందిపేట పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీధర్‌రెడ్డి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండలంలో గంజాయి సరఫరా జోరుగా సాగుతోందనే ప్రచారం నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై చిరంజీవి ఆధ్వర్యంలో గత వారం రోజులుగా ప్రత్యేక టీము నిఘా సారించింది. పక్కా సమాచారం మేరకు ఆదివారం ఉదయం పోలీసులు వెల్మల్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఉదయం 10 గంటల సమయంలో నిజామాబాద్‌కు చెంది షేక్ అఫ్రోజ్, షేక్ మహబూబ్ స్కూటీపై వస్తుండగా అనుమానంతో వాహనాన్ని తనిఖీ చేసి స్కూటీ డిక్కీలో రెండున్నర కిలోల గంజాయిని గుర్తించారు. పోలీసులు వారిని విచారించగా మండలంలోని యువకులు, విద్యార్థులకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. అఫ్రోజ్ గతంలో గంజాయి కేసులో పట్టుబడినట్లు సీఐ తెలిపారు. యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

వేల్పూర్ : మండలంలోని పడగల్ గ్రామంలోని కోళ్ల ఫామ్‌లో కొనసాగుతున్న పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, సీసీఎస్ సిబ్బంది దాడి చేశారు. పేకాట ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.35,460 నగదుతోపాటు 13 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను వేల్పూర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు సమాచారం.

బేకరీ ఓనర్‌కు కత్తులతో బెదిరింపు

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ధర్మపురి హిల్స్‌లో బేకరీ ఓనర్‌ను కత్తులతో బెదిరించిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. పాల ప్యాకెట్ విషయంలో తలెత్తిన వివాదంలో నలుగురు యువకులు బేకరీలో కత్తులతో వీరంగం చేసినట్లు సమాచారం. ధర్మపురి హిల్స్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు శుక్రవారం సాయంత్రం పాల ప్యాకెట్ కోసం తన ఇంటి సమీపంలోని బేకరీకి వెళ్లగా ధర విషయంలో యజమానితో వాగ్వాదం చోటు చేసుకుంది. మరుసటి రోజు నలుగురు స్నేహితులతో కలిసి బేకరీకి వెళ్లిన యువకుడు యజమానితోపాటు అడ్డు వెళ్లిన వారిని సైతం కత్తులతో బెదిరించారు. బేకరీ యజమాని ఫిర్యాదు మేరకు బెదిరింపులకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.